ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024



16న శంకర్‌పల్లికి సీఎం రాక!

» పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

శంకర్‌పల్లి, ఆగస్టు 8 : అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ఈనెల 16న శంకర్‌పల్లి మండలానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో కేంద్ర పథకం అమృత్ 2.0 కింద రూ.32 కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన, టీయూఎఫ్ ఐడీసీ నిధులు రూ.21కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, సీఎం పర్యటన వివరాలను ఒకట్రెండు రోజుల్లో ఉన్నతాధికారులు వెల్లడించనున్నారు.



కేశంపేటలో బీడుగా మారిన వ్యవసాయ భూమి

ఈ ఏడాది వానాకాలం పంటల సాగు విస్తీర్ణంలో తగ్గుదల కనిపిస్తుంది. గత ఏడాది వానాకాలం పంటల సాగుతో పోల్చితే ఇప్పటి వరకు 1,76,225 ఎరాల్లో తగ్గుదల నమోదైంది. ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఈసారి ఏప్రిల్, మే నెలల్లో దుక్కులు దున్ని సర్వం సిద్ధం చేసుకున్న రైతులు విత్తులు విత్తేందుకు సిద్ధమయ్యారు. తొలకరి వర్షాల కోసం ఎదురు చూశారు. జూన్ మొదటి వారంలో తొలకరి వర్షాలు కురియడంతో విత్తనాలు విత్తుకున్నారు. తర్వాత వరుణుడు కరుణించక పోవడంతో విత్తిన విత్తనాలు దుక్కుల్లోనే మాడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మొలక దశలోనే నీరందక ఎదుగుదల లేక పోవడంతో రైతులు వాటిని దున్నేశారు. మరో దశలో కొంతమంది రైతులు విత్తనాలు విత్తగా... కొందరు రైతులు పంట వేయడం దండగని సాగు చేయకుండానే వదిలేశారు.

సాగు.. సగమే!

ఈ యేడాది భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

» గత ఏడాదితో పోల్చుకుంటే 1,76,225 ఎకరాల్లో తగ్గుదల
» ఏటేటా తగ్గుతున్న పత్తి సాగు, ఇదే దారిలో జొన్న, మొక్కజొన్న
» జిల్లాలో రైతులకు ప్రోత్సాహం కరువు
» పడిపోతున్న నూనెగింజలు, పప్పు దినుసుల సాగు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 8 : జిల్లాలో సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. వర్షాలు లేక సాగుబాట పట్టకుండా చాలామంది రైతులు మిన్నకున్నారు. చెరువులు, కుంటల్లో నీరున్న ప్రాంతాల్లో తప్ప ఎక్కడా పెద్దగా సాగు చేయలేదు. తొలకరి వర్షాలకు కురిసిన వర్షాలకు విత్తిన మెట్ట పంటలు కూడా ఎండిపోయాయి. అయితే, ఇటీవల వారం రోజుల పాటు ముసురు వర్షాలు కురవడంతో మెట్ట పంటలు చిగురించాయి. ఆ వానలకు రైతులు కొంత ధైర్యం చేసి సాగు బాట పట్టారు. దీంతో సాగు పుంజుకుంటున్న తరుణంలో మళ్లీ వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో మళ్లీ సాగు డీలా పడింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. అయితే, వరి సాగును ఈ నెలాఖరు వరకు చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నా వర్షాలు లేకపోవడంతో సాగుకు రైతులు ధైర్యం చేసే పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది వానాకాలం సాధారణ విస్తీర్ణం 4,54,820 ఎకరాలు. దీనిలో 3,57,105 విస్తీర్ణంలో వరి, జొన్న, మొక్కజన్న, కందులు, పెసర, పత్తి వంటి పంటలు సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలం సాగు ప్రణాళిక విస్తీర్ణం 4,45,428 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,80,880 ఎకరాల విస్తీర్ణంలోనే సాగు చేశారు. గత ఏడాది సాగు విస్తీర్ణాన్ని పోల్చుకుని చూస్తే 1,76,225 ఎరాల్లో సాగు తగ్గింది. ప్రస్తుతం వరి సాగు మినహా ఇతర పంటలు విత్తుకునే గడువు ముగిసింది. జూన్‌లో నారు పోసుకున్న రైతులు వర్షాలు లేక నారుమడులను వదిలేశారు. గత నెల 18 నుంచి 27వ తేదీ వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు కొంతమేర నిండాయి. వర్షాలు ఆలస్యం కావడంతో దీర్ఘకాలిక రకాలను జూలై 20 వరకే నాట్లు వేసుకోవాలని, 30 వరకు మధ్యకాలిక, ఈ నెల చివరి వారం వరకు స్వల్పకాలిక రకాలను నాటు కోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కాగా రైతులు జూలై చివరి వారం వరకు నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లకు మడులను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నాట్లు ఊపందుకున్నాయి. బోరు భావుల్లోకి భూగర్భ జల నీటిమట్టాలు పెరగడంతో వరినాట్లు వేసే పనిలో రైతులు బిజీ అయ్యారు.



చేవెళ్లలో సాగు చేసేందుకు దున్ని వదిలేసిన భూమి

తగ్గిన పత్తి సాగు విస్తీర్ణం

జిల్లాలో పత్తి సాగు తగ్గిపోయింది. ప్రధానంగా పంట పెట్టుబడి, కూలీల కొరత వంటి కారణాలతో పత్తి సాగుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తుంది. 2023 వానాకాలంలో 1,87,200 ఎకరాలు పత్తి సాధారణ సాగు విస్తీర్ణం కాగా 1,27,786 ఎకరాలు సాగు చేశారు. 2024 వానాకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 1,76,174 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,10,563 ఎకరాలు సాగు చేశారు. గత ఏడాది సాగు విస్తీర్ణంతో పోల్చుకుంటే ఈసారి 17,223 ఎకరాలు తగ్గింది.

2023 వానాకాలంలో సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	సాధారణం	సాగైంది
వరి	79,215	1,38,508
జొన్న	14,953	2,760
మొక్కజొన్న	79,669	60,022
పెసర	245	13
కందులు	3,0040	8,938
పత్తి	1,87,200	1,27,786
మినుములు	68	04
వేరుశనగ	70	334
ఆముదం	353	37
ఇతర పంటలు	62,906	18,593

2024 వానాకాలంలో సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	సాగు ప్రణాళిక	సాగైంది
వరి	1,38,187	18,433
జొన్న	3,361	2,913
మొక్కజొన్న	66,530	27,055
కందులు	11,548	4,622
పెసర	48	14
వేరుశనగ	550	08
పత్తి	1,76174	1,10,563
ఇతర పంటలు	48,959	14,682

పత్తి దారిలోనే జొన్న, మొక్కజొన్న పంటలు

పత్తి పంట దారిలోనే జొన్న, మొక్కజొన్న పంటల సాగు తగ్గుముఖం పట్టాయి. 2023 వానాకాలంలో జొన్న 2,760 ఎకరాల్లో సాగు చేయగా 2024లో 2,913 ఎకరాలు సాగుచేశారు. గత ఏడాదితో స్వల్పంగా జొన్న సాగు పెరిగినప్పటికీ.. సాధారణ సాగు విస్తీర్ణంతో పోల్చితే తక్కువగానే ఉంది. మొక్కజొన్న పంటల విషయానికొస్తే.. 2023 సాధారణ సాగు 79,669 ఎకరాలు కాగా 60,022 ఎకరాలు సాగు చేశారు. 2024లో మొక్కజొన్న పంట ప్రణాళిక విస్తీర్ణం 66,530 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 27,055 ఎకరాలు సాగులోకి వచ్చింది. గత ఏడాదితో పోల్చుకుంటే 32,967 ఎకరాల్లో మొక్కజొన్న తగ్గింది.

నూనె గింజలు, పప్పుదినుసుల సాగుకు ప్రోత్సాహం లేక..

నూనె గింజలు, పప్పు దినుసుల సాగుకు ప్రోత్సాహం కరువైంది. దీంతో సాగు ఏటేటా తగ్గుతూ వస్తుంది. ప్రతి ఏటా విత్తనాలు, ఎరువులు, మార్కెటింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఈ పంటల సాగు గణనీయంగా తగ్గుతోంది. పొద్దుతిరుగుడు, వేరుశనగ, ఇతర నూనెల గింజలు, పప్పు దినుసుల ఉత్పత్తిని పెంచాలన్న ప్రభుత్వ ఆలోచనలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అందుకు తగ్గ ముందస్తు ఏర్పాటు చేయక పోవడంతో పంటల మార్పిడిపై రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో మార్కెట్‌లో పప్పు, నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పప్పు దినుసులు, నూనె గింజల సాగు పెంచితే అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం ప్రోత్సహించాలన్సిన అవసరం ఉంది. గత ఏడాది వానాకాలంలో వేరుశనగ 334 ఎకరాల్లో వేయగా ఈ సారి కేవలం 8 ఎకరాల్లోనే సాగు చేశారు. శనగలు,పెసలు, మినుములు పప్పు ధాన్యాల సాగు గణనీయంగా పడిపోయింది.



టమాట నారు ఎండి పోయింది... తిరిగి మొక్కజొన్న వేశాను

వేసవిలో దుక్కులు దున్ని సిద్ధం చేశాను. తొలకరి వర్షాలు కురియగానే ఆరు ఎకరాల్లో టమాట నారు వేశాను. వర్షాలు కురియలేదు. దీంతో టమాట నారు ఎండి పోయింది. పొలంలలో నారును తొలగించాను. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు విత్తాను. ఆరు ఎకరాలకు బదులుగా నాలుగు ఎకరాల్లోనే మొక్కజొన్న సాగు చేశాను. రెండు ఎకరాలు వదిలేశాను. వర్షాలకు కురియక పోవడంతో టమాట నారు వేసి సుమారు రూ.లక్ష వరకు నష్టపోయాను.

- వై. మల్లేష్, రైతు,చేవెళ్ల



ఈ నెల చివరి వారం వరకు వరి నాట్లు వేసుకోవచ్చు

జూలై చివరి వారం వరకు నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో వరినాట్లకు మడులను సిద్ధం చేస్తున్నారు. కొన్నిచోట్ల నాట్లు ఊపందుకున్నాయి. బోరు బావుల్లోకి భూగర్భ జల మట్టాలు పెరగడంతో వరి నాట్లు వేసే పనిలో రైతులు బిజీ అయ్యారు. ఈ నెలాఖరు వరకు వరినాటు వేసుకోవచ్చు. సన్న రకాలను వేసుకోవాలి.

- గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

వర్షపాతం వివరాలు (మి.మీలలో)

నెల	కురవాల్సింది	కురిసింది
జూన్	94.0	97.0
జూలై	146.6	145.3
ఆగస్టు	146.0	1.5 (8వరకు)

మొక్కలు అందుబాటులో ఉంచాలి

» జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 8: పని ప్రదేశంలో మొక్కలు అందుబాటులో ఉండేట్లు చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో యువజన సంఘాలు, మహిళా సంఘాలను స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆమె సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో కమ్యూనిటీ ప్లాంటేషన్ చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. పంచాయతీ, అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించి ఎన్ని మొక్కలు అందుబాటులో ఉన్నవిషయమై తెలుసుకున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం తీసుకుంటున్నామని, జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. తరిగిపోతున్న వన సంపదను పెంచేందుకు ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటి ఆవరణలో పండ్లు, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ సక్రియా నాయక్, ఏపీవో బి.తిరుపతిచారి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.



ఎలిమినేడులో కమ్యూనిటీ ప్లాంటేషన్ చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో శ్రీలత

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి



తుక్కుగూడ మున్సిపాలిటీలో పర్యటిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

మహేశ్వరం/కందుకూరు, ఆగస్టు 8: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా భాగస్వాములు కావాల ని, దీంతో మన జీవన ప్రమానాలు మెరుగుపడతాయని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం తుక్కుగూడ మునిసిపాలిటీలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆమె మా ట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనాన్ని మెరుగు పర్చేలా ప్రతొక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఆమె పరిసరాల పరిశుభ్రతగురించి పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మధుమోహన్, కమీషనర్ వెంకట్‌రామ్, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని, వర్షాకాలంలో కురుస్తున్న వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్ కోరారు. అలాగే కందుకూరు మండలం నేదునూరు పంచాయతీని, ఆదర్శ పాఠశాలను, హాస్టల్‌ను ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు. ప్రతి ఇంటి అవరణ, వ్యవసాయ క్షేత్రాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించి వృక్షాలుగా పెంచాలన్నారు. ఆదర్శ పాఠశాలు, గురుకులాల్లో చదువుతున్న విద్యాభ్యాసం వసతులు కల్పించాలన్నారు. మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.సరిత, సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీవో గీత, ఐసీడీఎస్ సూపర్వైజర్ ఇందిర, ఏవో లావణ్య, ఏపీవో రవీందర్‌రెడ్డి, పచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏలు రవికుమార్, ఆశ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలే.. రైతు భరోసా రాలే!

» ఇదేనా కాంగ్రెస్ రైతు పాలన
» బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

కేశంపేట, ఆగస్టు 8: రైతులకు రుణమాఫీ కాలేదని, వారికి నేటికీ రైతు భరోసా ఇవ్వలేదని, గడువు దగ్గర పడుతున్నా ఫసల్ బీమాపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా జాతీర కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ రైతు పాలన అంటే అని ధ్వజమెత్తారు. కొత్తపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు రొల్లు రాఘురాములుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం రైతు రచ్చ బండ కార్యక్రమంలో భాగంగా రైతుల సంతకాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అందరికీ రూ.2లక్షల వరకు పంటరుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కటాఫ్ డేట్‌ను సాకుగా చూపి రెన్యూవల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ చేయడం లేదని అన్నారు. గత ప్రభుత్వం మాఫీ చేస్తుందనే హామీతో చాలా మంది రైతులు డీఫాల్టర్లుగా మారారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా రైతులకు ఒరిగిందేమిలేదన్నారు. రుణమాఫీ కానీ రైతులు 8886100097 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. రైతుల పక్షాన పోరాటం చేయడానికి బీజేపీ ముందుటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జె.రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మొర నరసింహారెడ్డి, మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటె శ్రీనివాస్, మోర్చా మండలాధ్యక్షుడు విఠల్ గౌడ్, నరసింహ, మధుసూదన్‌గౌడ్, శివాజీ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ వద్ద బస్సులు ఆపాలని ధర్నా

శంకర్‌పల్లి, ఆగస్టు 8 : శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామం వద్ద బస్‌లు ఆపడం లేదని మహిళలు గురువారం ధర్నా చేశారు. హైదరాబాద్ - శంకర్‌పల్లి రోడ్డుపై వెళ్తున్న బస్సులను అడ్డగించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ శంకర్‌పల్లి మండల కేంద్రం నుంచి నిత్యం 350 మంది మోకిలలో ఉన్న ఆయా విల్లాలు, అపార్ట్‌మెంట్లలోని ఇళ్లలో పనులు చేసేందుకు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మోకిల వద్ద ఉన్న రిక్వెస్ట్ బస్ స్టాప్ వద్ద బస్సులు ఆపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు నిలిపే వరకు ధర్నా చేస్తామని మహిళలు స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు ధర్నా ప్రదేశానికి చేరుకుని బస్సులు ఆపేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో మహిళలు ధర్నా విరమించారు.



మోకిల బస్టాప్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు

చిత్తాపూర్‌లో రాస్తారోకో

మంచాల: విద్యార్థుల కోసం అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా నాయకులు రావుల జంగయ్య ఆర్టీసీ అధికారులను కోరారు. గురువారం చిత్తాపూర్‌లో విద్యార్థులతో కలిసి గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల జంగయ్య మాట్లాడుతూ ఉదయం బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాచకొండ నుండి వచ్చే తిప్పాయిగూడ బస్సు అక్కడే ప్రయాణికులతో నిండిపోయి కిక్కిరిసి వస్తోందని.. ఈ క్రమంలో ప్రమాదకర పరిస్థితిల్లో ప్రయాణం సాగుతోందన్నారు. దీంతో చిత్తాపూర్‌కు వచ్చేసరికి బస్సులో స్థలం లేక చదువులకు వెళ్లలేక పోతున్నారన్నారు. కావున పాత పద్ధతిలో చిత్తాపూర్ నుండి కోఠి వరకు ఉదయం నడిచిన బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఆందోళనలో గ్రామస్తులు భద్రయ్య, పి.రాజు, జె.శర్మ, బి.రమేష్, రాకేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.




















పాలిటెక్నిక్ కళాశాలలో 12న స్పాట్ కౌన్సెలింగ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 8: మేడ్చల్ పాలిటెక్నిక్‌లో చేరేందుకు ఈనెల 12న, స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12న ఉదయం 10గంటల వరకు సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలని సూచించారు.

కళాశాల సమస్యల పరిష్కారానికి కృషి

నవాబుపేట, ఆగస్టు 8: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చేవేళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్వర్‌స్వామి ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు.

ఉపాధి నైపుణ్య శిక్షణకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాల కరస్పాండెంట్ భూపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రావులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 8: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల, విశాఖపట్నంకు చెందిన సీఎస్‌సీ అకాడమిలు ఉపాధి నైపుణ్య శిక్షణకు పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్‌స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్(సీఎస్‌సీ) సలహాదారు వై.రామ్మోహన్‌రావుతో ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసుల రెడ్డిలు అవగాహన పత్రాలను మార్చుకున్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికతపై సి-డాక్, ఐఈఈఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ సీహెచ్.భూపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీశైలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విస్తరణపై దృష్టి సారించాలి

ఘట్‌కేసర్, ఆగస్టు 8: పార్టీ నిర్మాణంపై కార్యకర్తలు దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ ఆర్జీకేకాలనీలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 14లో 2ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతున్నదని అన్నారు. కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.







గుమ్మడవెల్లి తండాలో సీత్లా వేడుక జరుపుకుంటున్న గిరిజనులు

ఉత్సాహంగా సీత్లా పండగ

కందుకూరు, ఆగస్టు 8 : మండలంలోని గుమ్మడవెల్లితండాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గిరిజనులు సీత్లా పండుగను కనుల పండువగా జరుపుకున్నారు. తండాలో బోనాలను ఊరేగించి కులదైవానికి నైవేద్యం సమర్పించారు. పూజారి జగ్గునాయక్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భారీ సంఖ్యలో మహిళలు, స్థానికులు గణేష్‌నాయక్, శంకర్, సిద్ధార్థ్, లాలూ, చందర్, రాజు, హరిలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నివారణకు అప్రమత్తంగా ఉండాలి

మొయినాబాద్, ఆగస్టు 8: బంగారు నగల దుకాణాల్లో తరచూ చోరీలు జరుగుతున్న నేపథ్యంలో జ్యువెలరీ షాపుల యజమానులు అప్రమత్తంగా ఉండాలని, దుకాలణాల వద్ద సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలని మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బంగారం వ్యాపారులతో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తగిన రక్షణ చర్యలు తీసుకుంటేనే చోరీలను అరికట్టొచ్చన్నారు. సీసీ కెమెరాలను షాపు లోపల, బయట ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణం వద్ద వాచ్‌మ్యాన్‌ను పెట్టుకుంటే మరింత బాగుంటుందని చెప్పారు. వ్యాపారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఏ మాత్రం అనుమానం ఉన్నా అనుమానితులపై వెంటనే పోలీసులకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బంగారం వ్యాపారులు కోరితే గస్తీ పెంచుతామని అన్నారు. సమావేశంలో బంగారం దుకాణదాల యజమానులు కృష్ణచారి, భాస్కర్, రాజేష్, రమేష్, సాగర్, సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి రామ మందిర్‌లో 'భగవత్ కథ'

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 8: ఈ నెల 11 నుంచి 17 వరకు షాద్‌నగర్ రామమందిర్‌లో భగవత్ కథ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాజస్థానీ మిత్రమండలి సభ్యులు జగదీష్‌శర్మ, కృష్ణ జవార్ తెలిపారు. కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను గురువారం ఆహ్వానించారు. 11న ఉదయం 9గంటలకు గంజ్ గణేష్ మందిరం నుంచి రాజస్థానీ సేవాసంఘ్ ట్రస్ట్ భవనం వరకు చేపట్టే కలశయాత్రతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7గంటల వరకు నిర్వహించే కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని కోరారు.



ఎమ్మెల్యే శంకర్‌ను ఆహ్వానిస్తున్న రాజస్థానీ మిత్ర మండలి సభ్యులు

జిల్లాలో 4.47లక్షల ఎకరాల్లో పంటల సాగు

- 73,071 మంది రైతులకు రుణ మాఫీ
- జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



చింతామణిపట్నంలో పెసర చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

తాండూరు రూరల్, ఆగస్టు 8: జిల్లాలో 5.78లక్షల ఎకరాల సాధారణ సాగుకు ఇప్పటి వరకు 4.47లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. గురువారం చింతామణిపట్నంలో పొలాలను ఆయన పరిశీలించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ.. వానకాలంలో కంది, జొన్న, పెసర, మినుము, సోయాబీన్, వరి, పత్తి తదితర పంటలు వేశారన్నారు. పత్తి 2.41లక్షల ఎకరాలు, కంది 1.04లక్షల ఎకరాల్లో, వరి 42,916 ఎకరాల్లో, మొక్కజొన్న 29,871 ఎకరాలు, జొన్న 1,666 ఎకరాలు, పెసర 17,258 ఎకరాల్లో వేశారని తెలిపారు. వీటితో పాటు మినుము, సోయాబీన్, ఇరత పంటలు సాగుచేశారని వివరించారు. జిల్లాలో రెండు విడతల్లో కలిపి 73,071 మంది రైతులకు రూ.5.19కోట్ల రుణమాఫీ అయిందన్నారు. ఆయన వెంట రైతులు సాయి రెడ్డి, బాలకృష్ణయ్యగౌడ్ ఉన్నారు.

యూరియా, డీఏపీల కొరత లేదు

బషీరాబాద్: జిల్లాలో యూరియా, డీఏపీ ఎరువులకు కొరతలేదని డీఏవో గోపాల్ తెలిపారు. బషీరాబాద్(నవాంద్గీ) ప్యాక్స్‌ను ఆయన సందర్శించారు. సీఈవో బందెయ్యగౌడ్‌తో ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. రైతులతో ఆయన మట్లాడుతూ రుణామాఫీ అయ్యిందా? అని అడిగారు. విలేకరులతో మట్లాడుతూ సొసైటీలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా 9,949టన్నులు, డీఏపీ 1,341 టన్నుల నిల్వ ఉన్నాయని తెలిపారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా డిమాండ్ అధికంగా ఉందన్నారు. యూరియా దొరకదనే అనుమానంతో కొందరు రైతులు ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లడంతోనే కొన్నిచోట్ల తోటి రైతులకు యూరియా దొరకడం లేదని చెప్పారు. ఎరువుల సరఫరా నిరంతరం ప్రక్రియ అని, ఒక్కోసారి కొరత ఏర్పడినా రోజుల వ్యవధిలోనే సమకూరుస్తామని చెప్పారు. అవసరం ఉన్న మేరకే రైతులు ఎరువులను తీసుకెళ్లాలన్నారు. ఆయన వెంట ఏఈవో నవీన్‌కుమార్ ఉన్నారు.

రాడార్ స్టేషన్ స్థాపన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 8: దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ స్టేషన్ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పీవోడబ్ల్యూ జిల్లా కన్వీనర్ గీత, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్ కోరారు. గురువారం వారు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దామగుండం అడవిలో 2,900 ఎకరాలను రాడార్ స్టేషన్ వీఎల్ఎఫ్ నిర్మాణానికి కేటాయించారన్నారు. ఇందుకు అడవిలో 12లక్షల వృక్షాలను తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం మొక్కలు నాటి పెంచాలని పిలుపునివ్వడం సంతోషకరమే గానీ, ప్రాజెక్టుల పేరుతో ఔషధ గుణ మొక్కలను తొలగించడం బాధాకరం అన్నారు. వీఎల్ఎఫ్ వల్ల 60 నుంచి 70కిలో మీటర్ల మేర రేడియేషన్ ప్రభావం ఉంటుందన్నారు. దీంతో వికారాబాద్ జిల్లా భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ఈ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్‌కు ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతులన్నీ రద్దు చేసి దామగుండం అటవీ ప్రాంతాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో దామగుండం అటవీ ప్రాంత వాసి సత్యానందస్వామి, ఏఐకేఎంఎస్ నాయకులు రాములు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, పీవోడబ్ల్యూ నాయకురాలు ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా శివశంకర్

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 8: బీజేపీ ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన శివశంకర్ నియమితులైనారు. మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ గురువారం మొయినాబాద్‌లో జరిగిన ఎస్సీ మోర్చా సమావేశంలో నియామక పత్రం అందించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభుడు ఎంకనొళ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందిస్తున్న జ్ఞానేశ్వర్

నరికిన చోటే మొక్కలు నాటాలి

ఇటీవల హైకోర్టు వినూత్న తీర్పు ● జిల్లాలో అటవీ ఆక్రమణదారుల్లో గుబులు

వికారాబాద్, ఆగస్టు 8: అడవుల్లో చెట్లను నరికితే అక్కడ వాటిని నరికిన వ్యక్తులే కచ్చితంగా మొక్కలు నాటి అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించాలంటూ ఆగస్టు రెండున హైకోర్టు తీర్పునిచ్చింది. సామాజిక సంపదైన అటవీ ప్రాంతాలను వ్యక్తిగత అవసరాలకు ఆక్రమించుకోవడం తీవ్రమైన నేరంగా హైకోర్టు పరిగణించింది. మంచిర్యాల జిల్లాలోని జిల్లల మండలంలో అటవీ భూములు అన్యాక్రాంతమయ్యాయనే కేసులో కోర్టు ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఆక్రమణకు గురైన అటవీ భూములను స్వాధీనం చేసుకొని ఆక్రమించిన వారు ఎంతటి వారైనా వారితో మొక్కలు నాటాల్సిందేనని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో అటవీ భూముల ఆక్రమణదారులకు చెమటలు పడుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా కుల్కచర్ల, ధారూరు, బంట్వారం మండలాల్లోని అటవీ ప్రాంతాలు నరికివేతకు గురవుతున్నాయి. అడవిలోని చెట్లు నరికి సాగు చేసుకుంటున్నారు. కోర్టు తీర్పుతో ఇకపై చెట్ల జోలికి పోవాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మేరకు ప్రభుత్వం, అధికారులు అటవీ రక్షణకు కఠిన చర్యలు తీసుకునే వీలు కలిగింది. జిల్లాలో ఇప్పటికే అన్యాక్రాంతమైన అటవీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తిరిగి అటవీ ప్రాంతాన్ని పరిరక్షింస్తుందా? లేదా అనేది చూడాల్సిన అంశం. అధికారులు అటవీ ఆక్రమనదారులను గుర్తించి మొక్కలు నాటిస్తారా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. కోర్టు తీర్పుతో అటవీ పరిరక్షణకు పటిష్టచర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

పనులు నాణ్యతగా చేయాలి

బంట్వారం, ఆగస్టు 8: చేసే ప్రతీ పనిని నాణ్యతగా చేయాలని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తొర్మామిడి, బస్వాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలు, కంపోస్ట్‌షెడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేసే ప్రతీ పనిని అంకితభావంతో పనిచేస్తేనే మంచి ఫలితాలొస్తాయన్నారు. గతంలో నాటిన మొక్కలు వృక్షాలుగా మారి పచ్చదనం చేకూరిందన్నారు. ఇలాంటి పనుల వల్లే ఉద్యోగులు సేవలు, పేర్లు చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కార్యక్రమంలో డీపీవో జయసుధ, డీఎల్పీవో సంధ్యారాణి, ఎంపీడీవో రాములు, ఎంపీవో నాగరాజ్, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



తొర్మామిడిలో నర్సరీని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

'గ్రామాలను విలీనం చేయొద్దు'

శంకర్‌పల్లి, ఆగస్టు 8 : శంకర్‌పల్లి మండల పరిధిలోని మీర్జాగూడ, మియఖాన్‌గూడా, ఇంద్రారెడ్డినగర్ తదితర గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయకూడదని గ్రామస్తులు గురువారం చేవెళ్ల ఆర్డీవో సాయిరాంను కోరారు. ఈ మేరకు గురువారం ఆయా గ్రామాల ప్రజలు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామాలన జీహెచ్ఎంసీలో వీలినం చేస్తే ఆర్థికంగా నష్టపోతామని వాపోయారు. గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని గ్రామస్తులు, పలువురు నాయకులు విన్నవించారు.

మేలు జాతి పశువులను ఎంచుకోవాలి

షాద్‌నగర్ రూరల్ ఆగస్టు 8 : పాడి రైతులు మేలు జాతి పశువులను ఎంచుకోవాలని, తద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని హెరిటేజ్ సంస్థ జోనల్ హెడ్ సత్యనారాయణ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాలలో గురువారం పశు పోషణ, పాల ఉత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. హెరిటేజ్ సంస్థ అందిస్తున్న రైతు రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన దాణాను వినియోగించుకోవాలన్నారు. పాడి రైతులకు 2లక్షల ప్రమాద బీమా అందిస్తుందని తెలిపారు. పశువులకు అవసరమైన మందులు సబ్సిడీపై ఇస్తామని తెలిపారు. పశువులకు తప్పకుండా బీమా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ నర్సింగ్‌రావు, శ్రీనివాస్, వెంకటేషం, సందీప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా పశువులకు టీకాలు వేయించాలి

ధారూరు, ఆగస్టు 8: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ పూర్ణచందర్‌రావు తెలిపారు. కేరెల్లి, ధారూరు పశువైద్యశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పశువైద్యశాలల రికార్డులను, స్టాక్ ఉన్న మందులను తనిఖీ చేసి, కుక్కలకు చేపట్టిన యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ధారూరు పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

21 నుంచి కట్టమైసమ్మ ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు

ఆమనగల్లు, ఆగస్టు 8: ఆమనగల్లు పట్టణంలోని సుర సముద్రం చెరువు కట్టపై గల శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మొక్తాల వెంకటయ్య తెలిపారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మొక్తాల వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు, పలువురు పట్టణ నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను మాజీ పీఏసీఎస్ చైర్మన్ తల్లోజు వెంకటయ్య, మత్స్యకార సంఘం అధ్యక్షుడు ఎర్రవోలు యాదయ్య, ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి వెంకటయ్య ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మొక్తాల వెంకటయ్య, నాయకులు



కేశంపేట డీసీఎంఎస్ కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

కేశంపేట, ఆగస్టు 8: రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని ఎరువులు, విత్తనాలు దుకాణాల యజమానులకు జిల్లా వ్యవసాధికారి గీతారెడ్డి ఆదేశించారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలోని డీసీఎంఎస్ ఎరువుల గోదాంతో పాటు పలు ఫర్టిలైజర్ షాపులను ఆమె పరిశీలించారు దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్‌లను పరిశీలించి, నిల్వలను చెక్ చేశారు. అవసరం ఉన్న ఎరువులను ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలన్నారు. అలాగే కేశంపేట మండలంలో మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, రైతులు మందులను పిచికారి చేయాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డీఏవో వెంట కేశంపేట మండల వ్యవసాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

హాజరుకానున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కడ్తాల్, ఆగస్టు 8: కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయ భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. శనివారం భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీలు, కలెక్టర్, రెవెన్యూ అధికారులు హాజరవుతారని తహసీల్దార్ పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు భవనాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న గూడూరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు

వేంకటేశ్వరాలయ స్వాగత తోరణం ...

తలకొండపల్లి: దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వార నిర్మాణం పూర్తైంది. ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కడ్తాల్-తలకొండపల్లి రహదారి నుంచి దేవుని పడకల్ గేటు రోడ్డులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి రాంరెడ్డి జ్ఞాపకార్థం రూ.25లక్షలతో ఆలయాన్ని, ఆర్చ్‌ను నిర్మించారు. మంత్రి జూపల్లి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, వంశీకృష్ణ, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శంషాబాద్, ఆగస్టు 8 : మున్సిపల్ కేంద్రంలోని 22వ వార్డులో గురువారం చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డుల్లో ఇప్పటి వరకు చాలా వరకు రోడ్లు నిర్మించామన్నారు. మిగిలిన రోడ్లను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. 21, 22వ వార్డుల్లో రూ.25లక్షలతో రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కౌన్సిలర్లు అజయ్, శ్రీకాంత్‌యాదవ్ స్థానిక నాయకులు దూడల వెంకటేశ్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి

ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ చేస్తా

- ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 8: తన కంఠంలో ప్రాణమున్నంత వరకు ప్రజాసేవ చేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం రావల్‌కోల్‌లో గంగపుత్ర సంఘం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కొన్నేళ్లుగా ఎనలేని కృషిచేశానని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ లైన్లు, మంచి నీటి ట్యాంకులు, వీధి దీపాలు ఏర్పాటు తదితర పనులు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించామన్నారు. మంత్రిగా ఉన్న నాడు గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించానన్నారు. తనపై నమ్మకంతో ప్రజలు రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవ చేస్తానని అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలను సమస్యల్లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. రావల్‌కోల్ గంగపుత్రులు భవనాన్ని ఏర్పాటు చేసుకోవటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు.



రావల్‌కోల్‌లో గంగపుత్ర సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర పీహెచ్‌సీని సందర్శించిన తమిళనాడు బృందం

కీసర, ఆగస్టు 8: కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆరోగ్యశాఖ అధికారుల బృందం గురువారం సందర్శించారు. ఈ మేరకు రోజువారీగా ఆ సెంటర్‌కు వచ్చే రోగుల వివరాలు, రోగుల సంరక్షణ, వారికి ఆహార ఏర్పాట్లు, ప్రాథమిక సంరక్షణపై రోగుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పీహెచ్‌సీ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుధ్యం పట్ల చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. మందుల పంపిణీ, నిల్వ, కొరత ఉన్న మందులకు, ప్రత్యామ్నాయ మార్గాలు ఏ విధంగా చేపడుతున్నారని జిల్లా వైద్యాధికారి రఘునందన్ స్వామిను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేకరించిన వివరాలను తమ రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదిక ద్వారా అందజేస్తామని తమిళనాడు అధికారుల బృందం తెలిపింది. కార్యక్రమంలో డాక్టర్లు సత్యవతి, సరస్వతీ, మల్లీశ్వరి, సౌందర్యలత, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో తమిళనాడు ఆరోగ్య శాఖ అధికారులు

అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 8: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ తరలింపు వంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని ఎస్ఓటీ, మేడ్చల్ పీఎస్ పట్టుకుని 175క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. లారీ డ్రైవర్ రాజశేకర్‌ను రిమాండ్‌కు తరలించామని, గజ్వేల్‌కు చెందిన రత్నాకర్, ఎల్‌బీ నగర్‌కు చెందిన ఫయాజ్‌ల పై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్వోటీ పోలీసులు పాల్గొన్నారు.

'తాండూరు పట్టణాభివృద్ధికి ప్రణాళిక'

తాండూరు/బషీరాబాద్: ఆగస్టు 8: తాండూరులోని సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికతో ముందుకువెళ్తున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో 197మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం 8వ వార్డులో పార్క్ కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కమిషనర్ విక్రంసింహారెడ్డి, కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, లలిత, రవిరాజు, రామకృష్ణ(రాము), వెంకన్నగౌడ్, భీంసింగ్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో బషీరాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు నర్సిరెడ్డి, పి.కాశిరెడ్డి, శేరి జనార్ధన్‌రెడ్డి, వాల్మీకి నరేష్, మునీర్ పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 8: దైవ కార్యక్రమాలు సమాజ శాంతి స్థాపనకు, మానవాళి సన్మార్గానికి దోహదపడుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆకుతోటపల్లిపల్లిలో రజక సంఘం మడేలేశ్వర మహాదేవస్వామి ఆలయాన్ని నిర్మించింది. ఈ నెల 19న విగ్రహప్రతిష్ఠ నిర్వహిస్తున్నారు. దీని కోసం రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మల్లేశ్, సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, వేణు, రామచంద్రయ్య, యాదయ్య, వెంకటయ్య, కానుగుల రాములు, శ్రీను, శేఖర్, తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ నాయకులు ● కార్మికుల సమ్మెకు మద్దతు


యాచారం : ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పాండు, కార్మికులు

చేవెళ్ల, ఆగస్టు 8 : గ్రామ పంచాయతీ కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. చేవెళ్ల డివిజన్ స్థాయిలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం చౌరస్తాలోని మహనీయుల విగ్రహాల ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆంజనేయులు, నర్సింలు, యాదయ్య, సుజాత, కార్మికులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.19 వేలు ఇవ్వాలంటూ సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కన్వీనర్ సీహెచ్ బుగ్గరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.


ఆమనగల్లు : సమ్మెలో పాల్గొన్న కార్మికులు

యాచారం : సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు దాటవేస్తున్నారని, ఎవరెన్ని కుతంత్రాలు చేసినా మా పోరాటం ఆపేది లేదని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే దాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. పంచాయతీ కార్మికులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్మికుల దహన సంస్కారాలకు రూ.30వేలు, రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్మికులు మరణిస్తే వారి కుటుంబానికి తక్షణమే రూ.5లక్షల సాయమందించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో నరేందర్‌రెడ్డికి అందజేశారు. సీఐటీయూ నాయకులు పి.బ్రహ్మయ్య, చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న రాజు, తదితరులు

మంచాల : గ్రామపంచాయతీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాపిత సమ్మెలో భాగంగా మంచాలలో ఆందోళన చేపట్టారు. కృష్ణ మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బిల్లులు విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. సమ్మెలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మిక యూనియన్ నాయకులు కుమార్, జగన్, సురేష్, హీరాలాల్, సాలమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం : సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఆమనగల్లు : న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఒక్క రోజు సమ్మె చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. కొద్ది సేపు ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని, కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, జీవో నెంబర్ 51ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జె.పెంటయ్య, ఆమనగల్లు మండల యూనియన్ అధ్యక్షుడు పాండు, కార్యదర్శి లక్ష్మణ్, కవిత, దోళి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి బన్సీలాల్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. పెండింగ్ వేతనాలు ఇచ్చి, కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు.


చేవెళ్ల : ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- అధికారులు, ప్రజాప్రతినిధులు
- నాలుగో రోజు స్వచ్ఛదనం-పచ్చదనం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 8: వాతావరణ సమతుల్యం కాపాడుకోవడానికి మొక్కలు నాటి సంరక్షిస్తూనే.. ఇంటి పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపడితేనే ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా జీవనం గడుపుతారని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటి, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఉప వైద్యాధికారిణి విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోకపోతే ఈగలు, దోమలు పెరిగి టైఫాయిడ్, డెంగీ, మలేరియా, వాంతులు, విరేచనాలు వంటి జబ్బులు, అంటువ్యాధులు సైతం వస్తాయన్నారు. కౌన్సిలర్ చంద్రకళ, కమిషనర్ వెంకన్న, డాక్టర్ నాగేందర్, హెచ్ఎం శైలజ, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి సూచించారు. మండలం పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగహన కల్పించారు. డాక్టర్ నివేదిత, ఎంఈవో మనోహర్, హెచ్ఎం చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేషయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లేడు, వనంపల్లిలో సచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దార్ జగదీశ్వర్, మాజీ సర్పంచ్ బాబురావు, ఎంపీవో హన్మంత్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : వనమహోత్సవంలో భాగంగా మండలంలోని ప్రతీ గ్రామంలో వెయ్యి మొక్కలకు తగ్గకుండా నాటాలని ఎంపీడీవో పద్మావతి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించాలన్నారు.

ఇబ్రహీంపట్నం : వీధి కుక్కలను పట్టణానికి దూరంగా పంపే ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ చైర్పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీందర్ సాగర్‌లు తెలిపారు. పెంపుడు కుక్కలను కూడా వీధుల్లోకి వదలవద్దని సలహా చేశారు. వీధి కుక్కల బెడద నుంచి ఎలా కాపాడుకోవాలనే దానిపై ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్, మలేరియా, డెంగీలపై సర్వే నిర్వహించారు. డా.సరిత, హెల్త్ ఎడ్యూకేటర్ హేమలత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ పాఠశాలలో మొక్కలు నాటుతున్న చైర్మన్ నరేందర్

యాచారం : ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలతలు యాచారం, గున్‌గల్, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆశావర్కర్లు, కార్యదర్శులు ఇల్లిల్లూ తిరిగి జ్వర సర్వే చేశారు. వీధి కుక్కలు ఏయే గ్రామంలో ఎన్ని ఉన్నాయని కార్యదర్శులు కారోబార్, పశుసంవర్ధకశాఖ అధికారుల చేత విచారణ చేపట్టారు. వీధుల్లో చెత్తాచెదారం తొలగించి ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు.

మంచాల : పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని మండల ప్రత్యేకాధికారిణి సుభాషిణి చెప్పారు. ఎల్లమ్మతండా, బోడకొండ, కొర్రవానితండా, సత్యంతండా, అంబోత్‌తండా, లోయపల్లిలో పర్యటించారు. అధికారులు, సిబ్బందితో కలిసి పల్లెప్రకృతివనం, నర్సరీ, మురుగునీటి వ్యవస్థలను పరిశీలించారు. ఎంపీడీవో బాలశంకర్, ఈవోఆర్డీ ఉమారాణి, పంచాయతీ కార్యదర్శులు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : స్వచ్ఛదనం-పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మున్సిపల్ కమిషనర్ వసంత, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరిక్షీత్ నరేంద్రలు అన్నారు. పట్టణంలో మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించారు. పది మందికి సాదారణ జ్వరాలు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. గిరిజన బాలికల, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మంజులాదేవి, ఎంపీహెచ్ ఈవో తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశాలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగామ : మొక్కలు నాటి మానవాళిని కాపాడుకుందామని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేకగూడలో యునైటెడ్ వేఆఫ్ హైదరాబాద్-మైక్రోసాఫ్ట్ సంస్థల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. నవీన్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. యునైటెడ్‌వే ప్రతినిధులు శ్రీచందన, చంద్రకాంత్, మధుమతి, రాములు, సాయికిరణ్ నాయకులు పద్మారెడ్డి, రాజునాయక్, మేకం రాజు, నర్సింహ, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చైర్‌పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కౌన్సిలర్లు నూరజబేగం, అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


నందిగామ : మొక్కను నాటుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

శంషాబాద్ : మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి 18, 21వ వార్డుల్లో కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు అజయ్, శ్రీకాంత్‌యాదవ్, స్థానిక నాయకులు దూడల వెంకటేశ్‌గౌడ్ కమిషనర్ సమన్‌రావుతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూర్ : మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాలు కొనసాగాయి. మున్సిపాలిటీలోని 11వ వార్డులో చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి చెత్తచెదారం ఎత్తివేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కుక్కకాటు నివారణ, కుక్కల దాడులపై కాలనీవాసులకు అవగహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలన్నారు. కమిషనర్ బాలాజీ, మేనేజర్ రాజు తదితరులున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- ఈనెల 4న పురుగుల మంది తాగడంతో ఆస్పత్రికి తరలింపు..

చేవెళ్ల, ఆగస్టు 8 : కుటుంబ ఆర్థిక పరిస్థితి, ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడిఘనాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కండ్లపల్లి చంద్రయ్య(65) కుటుంబ ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా మారడంతో ఈనెల 4న తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియాకు తరలించారు. చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో చోరీ.. రూ.30వేల అపహరణ

శంకర్‌పల్లి, ఆగస్టు 8 : హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగింది. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలో సురేష్ అనే వ్యక్తి శివమ్ ప్లైవుడ్, హార్డ్‌వేర్ అనే దుకాణాన్ని నడుపుతున్నాడు. బుధవారం రాత్రి దుకాణం మూసి ఇంటికెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా దుకాణం షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. అనుమానం వచ్చి లోపలికెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.30వేలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మాడ్గుల, ఆగస్టు 8: మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొమ్ము మహేందర్(35) బుధవారం అర్ధరాత్రి విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అప్పారెడ్డికి చెందిన మహేందర్ హైదరాబాద్‌లోని ఓ యజమాని వద్ద లారీడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈక్రమంలో అతడు బుధవారం హైదరాబాద్ నుంచి విజయవాడకు లారీని తీసుకొని వెళుతుండగా విజయవాడ సమీపంలో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టాడు. అతడి రెండు కాళ్లు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆస్పత్రికి తరలించారు. మహేందర్‌కు భార్యాపిల్లలున్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం


తల్లి రాములమ్మ, ఇద్దరు కూతుళ్లు

ఆదిభట్ల, ఆగస్టు 8 : కిరాణ షాప్‌కు వెళ్తున్నట్లు అత్తతో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన ఓ మహిళ ఇద్దరు కూతుళ్ల అదృశ్యమైన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గువ్వ కొండాల్ భార్య రాములమ్మ ఇద్దరు కూతుళ్లతో కలిసి మహేశ్వరం మండలం రావిరాలకు వలస వచ్చాడు. భార్యాభర్తలు కూలి పనులకు వెళ్తుండగా ఇద్దరు కూతుళ్ల ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఈనెల 6న కొండాల్ కూలి పనికి పోగా.. రాములమ్మ ఇంటి దగ్గరే ఉంది. భర్త కొండాల్ ఉదయం 8 గంటలకు పనికి వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. భార్య, కూతుళ్ల ఇంట్లో కనిపించలేదు. కిరాణ షాప్‌కు వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లినట్లు కొండలు తల్లి చెప్పింది. బంధువులు చుట్టు పక్కల పరిచయస్తులను వాకబు చేసినా భార్య రాములమ్మ ఇద్దరు కూతుళ్ల ఆచూకీ లభించలేదు. కొండలు గురువారం సాయంత్రం ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది


సన్మానం పొందిన టీచర్లతో గ్రామస్తులు

షాబాద్/కొందుర్గు, ఆగస్టు 8 : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని ఎంఈవో శంకర్‌రాథోడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డిలు అన్నారు. షాబాద్ మండలం ఎల్గోండగూడ, మక్తగూడ గ్రామాల ప్రాథమిక పాఠశాలలో నర్సింహ, వెంకటకృష్ణ, కృష్ణలు బదిలీపై వెళ్లడంతో గ్రామస్తులు సన్మానించారు. మాజీ వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ కొందుర్గు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉషశ్రీ, శివలింగమ్మ, సరితలను సన్మానించారు. హెచ్ఎం వెంకట్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు కె.నర్సింలుగౌడ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీనాథ్, తదితరులు ఉన్నారు.

పోలీసుల దాడిని నిరసిస్తూ న్యాయవాదుల ధర్నా


ఇబ్రహీంపట్నం : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం, ఆగస్టు 8: న్యాయవాదులపై పోలీసుల దాడులను ఖండిస్తూ ఆమనగల్లు పట్టణంలో గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు. జనగాం జిల్లాలో న్యాయవాదులు అమృతరావు, కవితలపై దురుసుగా ప్రవర్తించి దాడిచేసిన సీఐ రఘుపతి, ఎస్ఐ తిరుపతిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లేపల్లి జగన్, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అండేకార్ యాదిలాల్, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, కోశాధికారి మధు, లైబ్రేరియన్ శేఖర్, న్యాయవాదులు కొప్పు కృష్ణ, మల్లేశ్, సంతోష్‌కుమార్, జయంత్ కుమార్, జగన్‌గౌడ్, సి.శ్రీనివాస్, మురళి, సర్ధార్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా న్యాయవాదులపై పోలీస్ అధికారుల దాడులను అరికట్టాలంటూ ఇబ్రహీంపట్నంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరెడ్ల అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జేపీ మహేందర్‌లు మాట్లాడుతూ జనగామ పోలీసులు భౌతిక దాడులకు దిగడమేగాక పరుష పదజాలంతో అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధనుంజయగౌడ్, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పత్యానాయక్ జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు, ఆగస్టు 8: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, అనురాధపత్యానాయక్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్, ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు ఆదిలక్ష్మీలతో కలిసి పత్యానాయక్ కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలుచోట్ల మొక్కలు నాటి పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. పత్యానాయక్‌కు మాజీ మంత్రి కేటీఆర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బాల్‌రాజ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

మొయినాబాద్, ఆగస్టు 8 : మొయినాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఇండియన్ క్యాన్సర్ సొసైటీ సౌజన్యంతో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు 105 మంది హాజరయ్యారు, ఇందులో పలువురికి క్లినికల్ టెస్టులు నిర్వహించారు. 10 మందిని హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కొంతమంది రక్తనమూనాలు తీసుకున్నారు. రిపోర్టులు వచ్చాక అవసరం ఉన్నవారిని హైదరాబాద్ ఆస్పత్రికి పంపించడం జరుగుతుందని చేవెళ్ల డీడీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్, చెప్పారు. ప్రాజెక్టు అధికారి డాక్టర్ రాజేష్, డాక్టర్లు శ్రీనివాస్, స్వర్ణలత, అన్నపూర్ణ, సీహెచ్‌వోలు సంతోష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి

చేవెళ్ల, ఆగస్టు 8 : మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల మూడు నెలలుగా వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఒకేషనల్ టీచర్లు, ఔట్‌సోర్సింగ్, హావర్లీ బేస్ట్ టీచర్లు గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

ఆమనగల్లు, ఆగస్టు 8 : నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని సీఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు పునరుద్దరణపై గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై బి.వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పట్టణంలో మెడికల్ దుకాణాదారులు రూ.లక్ష అందించారు.

తిరుపతిరెడ్డికి కసిరెడ్డి శుభాకాంక్షలు


తిరుపతిరెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి, శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు

ఆమనగల్లు/షాబాద్, ఆగస్టు 8: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డిని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీలు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వేర్వేరుగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో తిరుపతిరెడ్డి, నాయకులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్ రెడ్డి, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎనుముల తిరుపతి రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌లు నగరంలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నేడు(శుక్రవారం) ఆమనగల్లు పట్టణంలో చెంచు సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు తెలిపారు. పట్టణంలో చెంచులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎంపీ మల్లు రవిలు హాజరవుతున్నట్లు చెప్పారు.

శంషాబాద్ : కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకే ప్రాధాన్యత ఇవ్వాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్‌ఉపాధ్యక్షుడు జె.నరేందర్ అన్నారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని సాతంరాయిలో మాట్లాడుతూ కార్యకర్తల కృషివల్లనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆయన తెలిపారు.

ఆమనగల్లు : ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 12న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాష తెలిపారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కందుకూరు : షాద్‌నగర్‌లో దళిత మహిళపై దాష్టీకానికి పాల్పడిన సీఐ, ఇతర పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ అమరేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై రాజకీయ నాయకులు, పోలీసులు ముకుమ్మడి దాడులు చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు.

మొయినాబాద్ : మనిషి ఆరోగ్యంలో భాగమైన దంతాల ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమైనదని, దంతాల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని బాలాజీ దంత వైద్య కళాశాల వైద్యురాలు హరిత అన్నారు. గురువారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో డాక్టర్ క్రాంతితో కలిసి పోలీసులకు దంతాల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సల్మాన్ పర్వేజ్, నిఖిల్, జానీజప్పర్ పోలీసులు పాల్గొన్నారు.

కేశంపేట : కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి రాజేంద్రనగర్‌కు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు డి.సరిత విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేసింది. కార్యక్రమానికి ఎంఈవో మనోహర్, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డిలు హాజరై విద్యార్థులకు వాటర్ బాటిల్లను అందించారు. ఎంఎన్‌వో చంద్రశేఖర్, సీఆర్‌పీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : భూత వైద్యుల మూఢనమ్మకాలను ప్రజలు నమ్మొద్దని గద్వాల్ జిల్లా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బి.హనుమంతమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భూత వైద్యులను నమ్మకూడదని సూచించారు. వైద్యాధికారి రేవతి రెడ్డి, దీపిక, మెడికల్ ఆఫీసర్ మహ్మద్ మన్సూర్, సిబ్బంది ఉన్నారు.

కొత్తూర్ : ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించాలని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు సూచించారు. కొడిచర్లతండాను గురువారం సాయంత్రం పోలీసులు సందర్శించి తండావాసులను పలు సూచనలు చేశారు. రాబోయే పండుగలను ప్రశాంతవాతావరణంలో కలిసి మెలిసి జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. తండాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

కందుకూరు : అప్పుడే పుట్టిన చిన్నారికి తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఎంపీడీవో సరిత, మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీలు తెలిపారు. నేదునూరు గ్రామంలో గల నాలుగు అంగన్‌వాడి కేంద్రాల్లో సూపర్‌వైజర్ ఇందిర ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.

తలకొండపల్లి : మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో లౌఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌భాయ్ పటేల్, పీఏసీఎస్ డైరెక్టర్ నయిమోద్దీన్‌ల ఆధ్వర్యంలో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థుల సౌకర్యార్థం రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రం, గదిని జస్మత్ భాయ్‌పటేల్ ప్రారంభించారు. తన సోదరుడు మహ్మద్ హబీబోద్దీన్ స్మారకార్థం నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నయీమ్‌ను పలువురు అభినందించారు.

కడ్తాల్ : తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సరళాదేవీ అన్నారు. బిడ్డ ఎదుగుదలకు ఆరోగ్య సంరక్షణకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని ఆమె చెప్పారు. కడ్తాల్ మండల పరిధిలోని వాసుదేవ్‌పూర్‌లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు సరళాదేవీ అవగాహన కల్పించారు.